ఈనాడు ఖమ్మం

గురువారం అక్టోబరు 24, 2024

రహదారిపై గుంతల పూడ్చివేత

ఈనాడు కథనానికి స్పందన


పల్లిపాడు వద్ద గుంతలను పూడుస్తున్న సిబ్బంది

కొణిజర్ల, న్యూస్‌టుడే: ఖమ్మం-అశ్వారావుపేట రాష్ట్రీయ రహదారిలోని కొణిజర్ల, పల్లిపాడు మధ్య రెండు కిలోమీటర్ల మేర ఏర్పడిన గుంతలను పూడుస్తున్నారు. 'రెండు కిలోమీటర్లు.. 200 గుంతలు' శీర్షికన ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను విశ్లేషిస్తూ 'ఈనాడు'లో ఈనెల 15న కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు రెండు రోజులుగా పెద్దపెద్ద గుంతల్లో తారుపోస్తున్నారు. పెద్ద గుంతలతో పాటు చిన్నపాటి గుంతలనూ బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

5న ప్రజాభిప్రాయ సేకరణ: కలెక్టర్

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: బీసీ కుల గణనపై ప్రజాభిప్రాయ సేకరణకు తక్షణ చర్యలు తీసుకోవాలని బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ తెలిపారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సర్వేపై ప్రజాభిప్రాయాలు సేకరించాలన్నారు. బీసీ కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ జరపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సమగ్ర కులాల సర్వే చేపట్టిందని తెలిపారు. బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులాల సమగ్ర వివరాలు సర్వేలో సేకరించాలని సూచించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ... నవంబరు 5న ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ఇక్కడి కలెక్టరేట్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాడిశెట్టి శ్రీజ, సీపీఓ శ్రీనివాస్, బీసీ సంక్షేమ అధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తదితరులు

పాఠశాలల అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదు: శ్రీజ


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ. పక్కన సీపీఓ శ్రీనివాస్

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: పాఠశాలల అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని, చేసిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాడిశెట్టి శ్రీజ అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ... పనులు చేసేందుకు కమిటీలకు ముందస్తుగా రూ.16.18 కోట్లు మంజూరు చేశామన్నారు. ఎంపీడీఓలకు రూ.12.28 కోట్లు విడుదల చేయగా ఇప్పటివరకు రూ.6.49 కోట్లు చెల్లించారని, మిగతా నిధులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 995 పాఠశాలల్లో 801 పనులు పూర్తి చేశారని, మరో 147 పాఠశాల్లో పనులు పురోగతిలో ఉన్నాయని, వేగంగా పనులు పూర్తిచేయాలన్నారు. సమావేశంలో సీపీఓ శ్రీనివాస్, డీఈఓ సోమశేఖర శర్మ, విద్యాశాఖ ప్రాజెక్ట్ అధికారి రామకృష్ణ, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఫార్మా కౌన్సెలింగ్

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: మూడు రోజులుగా నిర్వహించిన ఫార్మా కౌన్సెలింగ్ బుధవారం ముగిసినట్లు ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మహ్మద్ జాకిరుల్లా తెలిపారు. చివరి రోజు మొత్తం 197 మందికి 185 మంది హాజరయ్యారని వెల్లడించారు.



27న జిల్లా జట్ల ఎంపికలు


ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనే ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్లను ఎంపిక చేసే తేదీలు, వివరాలను కార్యదర్శి మూసాకలీం ఖమ్మంలో బుధవారం ప్రకటించారు. ఈనెల 27వ తేదీన బాస్కెట్‌బాల్, నెట్‌బాల్, కరాటే, వూషు జట్లు, నవంబరు 5వ తేదీన అథ్లెటిక్స్, వాలీబాల్, హ్యాండ్‌బాల్ జట్లను ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఉదయం పది గంటలకు ఎంపిక చేస్తామని తెలిపారు. అదనపు సమాచారం కోసం 98483 41238 నంబరును సంప్రదించాలని కార్యదర్శి సూచించారు.

ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే: ఆర్టీసీ ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలని ఆర్టీసీ కరీంనగర్ ఈడీ మునిశేఖర్ అన్నారు. జోన్ పరిధిలోని నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ రీజియన్ మేనేజర్లు, డిప్యూటీ రీజనల్ మేనేజర్లు, వివిధ డిపోల మేనేజర్లతో వరంగల్ రీజియన్ కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. ప్రతి డిపో పరిధిలో నెలా నెలా సమీక్షలు నిర్వహిస్తూ సంస్థ పురోగతిని పరిశీలించుకోవాలన్నారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్, ఆర్టీసీ సిబ్బందికి అందించే నైపుణ్య శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు.

పౌర సేవ.. ఇదే సత్వర తోవ..!

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం



పౌరులకు వివిధ రకాల సేవలను సంబంధిత గ్రామ పంచాయతీల్లోనే అందించేలా కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. జనన, మరణ ధ్రువ పత్రాలతో పాటు ఇతర సేవలన్నింటినీ పంచాయతీ కేంద్రంగా అందుబాటులోకి తీసుకురావటానికి సిటిజన్ చార్టర్ 2.0 అమలుచేయాలని భావిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్నా గ్రామ పంచాయతీలు దాన్ని అందిపుచ్చుకోవటం లేదని కేంద్రం గుర్తించింది. పౌరసేవల్లో 28శాతం మాత్రమే ఆన్‌లైన్ ద్వారా మిగతా 72శాతం ఆఫ్‌లైన్‌లోనే ప్రజలకు అందుతుండటంతో పారదర్శకత ప్రశ్నార్థకమవుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి పల్లెలో ఆన్‌లైన్ ద్వారా పౌరసేవలను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అందించేందుకు కేంద్రం నడుం బిగించింది.

క్లస్టర్ల వారీగా సంక్లిష్టం..!

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో గ్రామ పంచాయతీలను క్లస్టర్ల వారీగా విభజించి పౌరసేవలు అందిస్తున్నారు. మేజర్ పంచాయతీలైతే రెండు, చిన్నవైతే మూడు నుంచి నాలుగింటిని కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. ఆయా క్లస్టర్లకు కంప్యూటర్ ఆపరేటర్లను నియమించుకుని పంచాయతీ నిధుల నుంచి వేతనాలు చెల్లిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఆయా క్లస్టర్ ఆపరేటర్లు మండల కార్యాలయంలోనే ఉంటూ సేవలందిస్తుండటంతో ప్రజలతో పాటు పంచాయతీ కార్యదర్శులు సైతం తమ అవసరాల కోసం తప్పనిసరిగా మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. గ్రామ పంచాయతీల్లో అందాల్సిన సేవలు మండల కేంద్రానికి తరలిపోవటంతో ప్రజలకు కష్టమవుతోంది.

గ్రామ పంచాయతీల్లో డిజిటలీకరణ వల్ల పౌరులకు సత్వర సేవలందించేందుకు అవకాశముంటుంది. ప్రస్తుతం క్లస్టర్ల వారీగా సేవలందిస్తున్నప్పటికీ అవి మండల కార్యాలయానికే పరిమితమవుతున్నాయి. అందుకే సేవల్లో జాప్యం జరుగుతోంది. **– చంద్రమౌళి, జిల్లా పంచాయతీ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం**

పారదర్శకతకు ప్రాధాన్యం

సిటిజన్ చార్టర్ 2.0 అమలైతే ప్రతి గ్రామ పంచాయతీలో పౌరులకు డిజిటల్ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని 1,070 పంచాయతీల్లో కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. పారిశుద్ధ్యం, ఇంటిపన్ను వసూలు, గ్రామసభల నిర్వహణ, జనన, మరణ ధ్రువపత్రాల జారీ వంటి సుమారు 34 రకాల సేవలందిస్తున్నారు. వీటిని ఎప్పటికప్పుడు పంచాయతీ దస్త్రాల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆఫ్‌లైన్ ద్వారా అందించటం వల్ల అవకతవకలకు ఆస్కారమేర్పడుతోంది. డిజిటల్ సేవలు అందుబాటులోకి వస్తే పారదర్శకత పెరుగుతుంది.

డిజిటలీకరణతో సమస్యల పరిష్కారం

ఉభయ జిల్లాల్లో అనేక గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేవు. డిజిటలీకరణలో భాగంగా పక్కా భవనాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంది. భద్రాద్రి లాంటి గిరిజన జనాభా అధికంగా నివసించే జిల్లాలో డిజిటల్ సేవలందించాలంటే సిగ్నల్ వ్యవస్థను పటిష్ఠపరచాల్సి ఉంటుంది. ఇందుకోసం భారత్ నెట్‌వర్క్ లేదా రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో ఫైబర్ కేబుల్ నెట్‌వర్క్‌తో ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించాలి. వీటితో పాటు ప్రతి గ్రామ పంచాయతీకి ఒకరి చొప్పున కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమిస్తారు లేదా ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందికి కంప్యూటర్ శిక్షణ ఇస్తారు.

గురుకులంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: రఘునాథపాలెంలోని దానవాయిగూడెం మహాత్మా జ్యోతిబా పులే బాలికల గురుకుల పాఠశాలలో జిల్లాస్థాయి క్రీడా పోటీలను ఆర్‌సీఓ బ్యూలారాణి, ఇన్‌స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్ బుధవారం ప్రారంభించారు. పోటీలను రెండు విడతలుగా నిర్వహిస్తున్నామని, మొదటి విడతలో అండర్-17 విభాగానికి 23 నుంచి 25 వరకు, రెండో విడతలో అండర్-14, 19 విభాగాలకు 27 నుంచి 29వ తేదీల వరకు క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. ఈ క్రీడా పోటీలకు జిల్లాలోని మొత్తం 12 గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగమణి, ఏటీపీ బి.లలిత, డీడబ్ల్యూపి.ఊర్మిళ, పీఈటీ కల్పన పాల్గొన్నారు.


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్, ఆర్‌సీఓ బ్యూలారాణి


క్రీడా పోటీలకు హాజరైన విద్యార్థినులు

ఒకరోజు సామూహిక సెలవులో ఏఈఓలు

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లాలో వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈఓ)లు బుధవారం సామూహిక సెలవు పెట్టారు. రాష్ట్రంలో ఏఈఓలపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని 108 మంది రెగ్యులర్ వ్యవసాయ విస్తరణ అధికారులు సెలవులో ఉన్నారు. వీరిలో కొంతమంది హైదరాబాద్‌లో జరిగిన చర్చలకు హాజరవగా.. మరికొంత మంది స్థానికంగానే ఉన్నారు.

నిజామాబాద్ వెళ్లిన ఎస్ఈ

ఖమ్మం రోటరీనగర్, న్యూస్‌టుడే: టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్తు ఛార్జీల పెంపుపై నిజామాబాద్‌లో గురువారం ప్రజాభిప్రాయ సేకరణ(పబ్లిక్ హియరింగ్) సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు ఖమ్మం సర్కిల్ ఎస్ఈ ఎ.సురేందర్, టెక్నికల్ డీఈ బాబూరావు బుధవారం రాత్రి తరలివెళ్లారు.

కౌలు రైతుపై ఆంక్షల కత్తి!

ఈటీవీ, ఖమ్మం

భూములకు రూ.వేలకు వేలు కౌలు చెల్లించటమే కాకుండా పంటల సాగుకు రూ.లక్షల పెట్టుబడులు పెట్టిన కౌలుదారులు.. చివరకు రెక్కల కష్టాన్ని అమ్ముకునేందుకూ అవస్థలు పడుతున్నారు. ఈసారి ప్రకృతి విపత్తులతో దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. కొద్దోగొప్పో చేతికొచ్చిన పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలంటే పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్ కార్డు అవసరం. వీటిని ఇచ్చేందుకు అనేక చోట్ల భూయజమానులు ససేమిరా అంటున్నారు. విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారులకు పత్తి విక్రయించి కౌలుదారులు నష్టాలను మూటగట్టుకుంటున్నారు.

ఉభయ జిల్లాల్లో..

ఖమ్మం జిల్లాలో 1.09 లక్షల మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1.10 లక్షల మంది రైతులు ఈసీజన్‌లో సుమారు 4 లక్షల ఎకరాల్లో పత్తి సాగుచేశారు. వీరిలో లక్ష మందికి పైగా కౌలుదారులు ఉంటారు. పత్తి సాగుకు కర్షకులు అత్యధికంగా పెట్టుబడులు పెట్టాల్సి వస్తుంది. దీనికి తోడు భూమి కౌలుధర ఏటికేడు పెరుగుతోంది. ఎకరా పత్తిసాగుకు సుమారు రూ.50వేల వరకు ఖర్చవుతుంది. ఆరుగాలం కష్టపడినా ఈసారి ప్రకృతి విపత్తులు, తెగుళ్ల దెబ్బతో పత్తి పంటలు తెల్లబోయాయి.

గతంలో ఎకరాకు 10-15 క్వింటాళ్ల దిగుబడులు వస్తే ఈసారి ఆరు క్వింటాళ్లకు మించలేదు. చివరకు చేతికొచ్చిన ఆశల పంటను అమ్ముకుందామంటే.. వెంటాడుతున్న ఆంక్షల కత్తి కౌలుదారుల పాలిట శాపంగా మారుతోంది. ప్రైవేటు మార్కెట్‌లో కన్నా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కాసింత ఆశాజనకంగానే పత్తికి ధరలు పలుకుతున్నాయి. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో క్వింటాకు ధర రూ.7,521 లభిస్తోంది.



★ ఖమ్మం జిల్లాలో తొమ్మిది, భద్రాద్రి జిల్లాలో నాలుగు కొనుగోలు కేంద్రాలను సీసీఐ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాటుచేశారు. వీటిలో పత్తి విక్రయించాలంటే రైతు ఆధార్ కార్డు, పట్టాదారు, బ్యాంకు పాసుపుస్తకం తప్పనిసరి అనే నిబంధన ఉంది. దళారుల కట్టడి కోసం క్షేత్రస్థాయిలో ఏ పంటలను ఎంత విస్తీర్ణంలో ఎవరు పండిస్తున్నారనే వివరాలను వ్యవసాయశాఖ విస్తరణాధికారులు ఆన్‌లైన్‌లో గతంలోనే నమోదుచేశారు. కౌలురైతు పత్తి సాగుచేసిన చోట కూడా పట్టాదారు పేరే నిక్షిప్తపరిచారు.

కౌలు రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం. సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి విక్రయించాలంటే భూయజమాని ఆధార్ కార్డు, పాసుపుస్తకం ఉండాలి. ఇవి లేనిపక్షంలో స్థానిక వ్యవసాయ విస్తరణాధికారుల సంతకంతో కూడిన ధ్రువపత్రం అందించినా సరకు కొనాలని సీసీఐ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించాం. **- అలీం, డీఎంఓ, ఖమ్మం**

వ్యవసాయశాఖ పోర్టల్‌లో పంట సాగుచేసినట్లు ఎవరి పేరుంటే వారి ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం తీసుకెళ్తేనే సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో సరకును కొంటారు. కౌలుదారులు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించాలంటే పట్టాదారు ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకంతో వెళ్లాలి. ఇందుకు అనేకచోట్ల పట్టాదారులు అంగీకరించటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో కౌలుదారులు తమ సరకును కనీస మద్దతు ధరకు ఎలా అమ్ముకోవాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. కొన్నిచోట్ల గత్యంతరం లేక జిన్నింగ్ మిల్లుల నిర్వాహకులకే తక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

బోధన రుసుములు విడుదల చేయాలని డిమాండ్



ప్రదర్శన నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులపై సవతి ప్రేమ చూపుతోందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ ఆరోపించారు. 'చలో కలెక్టరేట్' ముట్టడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తొలుత వందలాది మంది విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు కలెక్టరేట్ వరకు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. విద్యార్థులు కలెక్టరేట్‌లోకి చొచ్చుకొని వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6 వేల కోట్ల బోధనా రుసుములు, ఉపకార వేతనాలను ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల వ్యాప్తంగా రూ.200 కోట్ల బకాయిలు ఉన్నాయని, ప్రభుత్వం స్పందించి తక్షణమే విడుదల చేయకపోతే మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, సహాయ కార్యదర్శులు ఎస్కే నాగుల్‌మీరా, మధు, శివనాయక్, మనోజ్, రాకేశ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


సమయ స్ఫూర్తితోనే జన సమూహాల నియంత్రణ

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: అవాంఛనీయ, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నప్పుడు అల్లరి మూకలను నియంత్రించేందుకు సమయస్ఫూర్తితో వ్యవహరించాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. అల్లరి మూకలను చెదరగొట్టడమే 'మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్' నిర్వహించామన్నారు. శిక్షణలో భాగంగా పోలీసు శిక్షణ కేంద్రంలో సివిల్, ఏఆర్ పోలీసుల మాక్ డ్రిల్‌ను బుధవారం నిర్వహించారు. ఆందోళనకారులను నిలువరించేందుకు మొదటగా హెచ్చరికలు చేయాలని, వినకపోతే ఉన్నతాధికారుల అనుమతితో బాష్ప వాయువు ప్రయోగించడం, ఆపై అగ్నిమాపకశాఖ వారి శకటంతో వాటర్ కెనాన్ ప్రయోగించడం, లాఠీఛార్జి చేయడం, ప్లాస్టిక్ బుల్లెట్లు ప్రయోగించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలన్నారు. చివరగా ఫైరింగ్ చేయాలని సూచించారు. ఘర్షణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునే అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పోలీసులు మాక్ డ్రిల్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు నరేశ్‌కుమార్, ప్రసాద్‌రావు, ఏసీపీ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.


మాక్ డ్రిల్‌లో ఆందోళనకారులను నిలువరిస్తున్న పోలీసులు

మధిరకు నిధుల వరద

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సొంత నియోజకవర్గం మధిరలోని రహదారులకు రూ.334.88 కోట్లు విడుదలయ్యాయి. ఆయన ఇక్కడి నుంచి వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం విదితమే. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మిగతా 9 నియోజకవర్గాల్లో ఎక్కడా లేని విధంగా గ్రామీణ రహదారుల అభివృద్ధికి మధిర నియోజకవర్గంలోని 5 మండలాల్లో 89 పనులకు రూ.334.88 కోట్లు మంజూరయ్యాయి. ఐదు మండలాల్లో ఇక మట్టి రోడ్డు అనేదే కనిపించదు. అన్నీ తారు రోడ్లుగా మారనున్నాయి. ఇప్పటికే కొన్ని రహదారుల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. వచ్చే ఉగాది నాటికి నియోజకవర్గంలోని రహదారుల రూపురేఖలు మారిపోనున్నాయి. పనులు వేగంగా పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను నిరంతరం పరుగులు పెట్టిస్తున్నారు.



గుత్తేదారుల మధ్య రహస్య అవగాహన?

మధిర నియోజకవర్గంలో గ్రామీణ రహదారుల అభివృద్ధి పనులు పెద్దఎత్తున మంజూరు కావడంతో వీటిని దక్కించుకునేందుకు పలువురు గుత్తేదారుల మధ్య రహస్య అవగాహన కుదిరినట్లు తెలుస్తోంది. ముదిగొండ మండలానికి చెందిన ఓ బడా గుత్తేదారు, ఫైనాన్సర్ చక్రం తిప్పినట్లు సమాచారం. దీంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని తిరువూరు, నూజివీడు, పుట్రేల ప్రాంతాలకు చెందిన పలువురు గుత్తేదారులు కొన్ని పనులు దక్కించుకున్నారు. ఖమ్మంలోని మరో బడా కాంట్రాక్టర్‌కు ఒక మండలంలోని మొత్తం పనులు దక్కించుకున్నట్లు తెలుస్తోంది. గుత్తేదార్లంతా అవగాహనతో తెరవెనుక మంత్రాంగం సాగించినట్లు సమాచారం.

వివిధ దశల్లో రహదారుల అభివృద్ధి పనులు

వెంకటరెడ్డి, పీఆర్ ఈఈ, ఖమ్మం

మధిరలో సీఆర్ఆర్(కాన్‌స్టిట్యుయెన్సీ రూరల్ రోడ్స్) పథకంలో వివిధ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. పనులు వివిధ దశల్లో ఉన్నాయి. వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. టెండర్లు పారదర్శకంగా ఆన్‌లైన్‌లో ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో నిర్వహిస్తారు. గుత్తేదారుల మధ్య ఒప్పందాలు జరిగినట్లు మా దృష్టికి రాలేదు.

పంటల డిజిటల్ సర్వేకు సరే..!

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం: నెల రోజులుగా పంటల డిజిటల్ సర్వేపై కొనసాగుతున్న ప్రతిష్టంభనకు తెరపడింది. హైదరాబాద్‌లో వ్యవసాయశాఖ సంచాలకుడితో బుధవారం జరిగిన సమావేశంలో వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈఓలు) ఓ అంగీకారానికి వచ్చారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు సర్వేలో పాల్గొంటామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే మళ్లీ మొదటికి

పనిభారం ఎక్కువవుతోందని, డిజిటల్ సర్వే చేయలేమని రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది ఏఈఓలు ప్రభుత్వానికి కొంతకాలంగా తేల్చిచెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సహాయ సిబ్బందిని నియమిస్తేనే సర్వే చేస్తామని తెలిపారు. వ్యవసాయశాఖ సంచాలకుడితో చర్చల అనంతరం పంటల డిజిటల్ సర్వే చేపట్టడానికి సుముఖత వ్యక్తం చేశారు. సర్వేలో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే సర్వేను నిలిపేస్తామంటున్నారు.



జిల్లా	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	ఏఈఓలు
ఖమ్మం	5.80 లక్షలు	129
భద్రాద్రి	5.76 లక్షలు	67

ఇన్నాళ్లు ప్రతిష్టంభనకు కారణమేంటి..?

భవిష్యత్తులో ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టాన్ని అంచనా వేయటం, ఆహార ధాన్యాల ఎగుమతి, పంట ఉత్పత్తుల కొనుగోలు, సాగు ప్రణాళిక తదితరాలకు పంటల డిజిటల్ సర్వే ఆధారం కానుంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం 'డిజిటల్ అగ్రి మిషన్' పథకాన్ని తీసుకొచ్చింది. దీని అమలుకు ఆయా రాష్ట్రాలకు నిధులు మంజూరు చేసింది. ఈ పథకంలో భాగంగా చేపట్టే పంటల సర్వేకు స్థానిక యువతను ఉపయోగించుకుని ఉపాధి కల్పించాలని సూచించింది. ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో ఇదే విధానం అమలవుతోంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఏఈఓల ద్వారానే సర్వే చేయించాలని చూస్తుండటంతో సమస్య ఉత్పన్నమైంది. ఒక్కో క్లస్టర్ పరిధిలో వేల ఎకరాల భూమి సాగవుతోందని, సహాయకులు లేకుండా సర్వే చేయటం సాధ్యం కాదని ఏఈఓలు మొండికేయటంతో ఇన్నాళ్లు ప్రతిష్టంభన నెలకొంది.

రెగ్యులర్ ఏఈఓలు సైతం..

వర్షాకాలం పంటల వివరాల నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేసిన ఏఈఓలకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పంటల డిజిటల్ సర్వే ఇబ్బందిగా మారింది. ఆయా క్లస్టర్ల పరిధిలో రైతులు సాగు చేసిన పంట పొలాలకు సంబంధించి ప్రతి గుంటను లెక్కించి ప్రత్యేక యాప్‌లో నిక్షిప్తపరచాల్సి రావడంతో తాము ఈ పని చేయలేమంటూ ఏఈఓలు చేతులెత్తేశారు. వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానాల్లో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పని చేస్తున్న ఒప్పంద సిబ్బందిపై భారం పడుతోంది. ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తే ఎక్కడ తమ ఉద్యోగాలకు ఎసరు వస్తుందేమోననే ఆందోళనలో ఒప్పంద సిబ్బంది సర్వే మొదలుపెట్టారు. ఇప్పుడు మూడు రోజుల పాటు సర్వే చేపట్టడానికి రెగ్యులర్ ఏఈఓలు అంగీకరించారు.

మూడు రోజుల పాటు సర్వే నిర్వహించిన తర్వాత ఏఈఓలకు ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వ్యవసాయశాఖ సంచాలకుడు హామీ ఇచ్చారు. ఈమేరకు గురువారం నుంచి పంటల డిజిటల్ సర్వే నిర్వహిస్తాం. తదనంతరం ఏఈఓల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకుంటే మళ్లీ ఐక్య కార్యాచరణతో ముందుకెళ్తాం.

- నర్సింహారావు, ఏఈఓల ఐకాస జిల్లా అధ్యక్షుడు, భద్రాద్రి కొత్తగూడెం

పిడుగు గుట్టు.. ప్రాణం నిలబెట్టు

చుంచుపల్లి, న్యూస్‌టుడే

ఉమ్మడి జిల్లాలో పిడుగుపాటు ఘటనలు ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్నాయి. కేవలం రెండ్రోజుల వ్యవధిలో రైతు కుటుంబాలకు చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఉభయ జిల్లాల్లో పిడుగుపాటు మరణాలు ఏటా పదుల సంఖ్యలో సంభవిస్తున్నాయి. పలు ఘటనల్లో మూగజీవాలు ఎక్కువ సంఖ్యలో చనిపోతున్నాయి. రెప్పపాటులో సంభవించే పిడుగుపాటును ముందే పసిగట్టవచ్చన్నది వాతావరణ శాస్త్రవేత్తల సూచన. అవగాహన కొరవడటం వల్లే చాలామంది రైతులు, వ్యవసాయ కూలీలు చనిపోతున్నట్లు వారు చెబుతున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్కువ భాగం అటవీ విస్తీర్ణం, ఎత్తైన కొండలు, గుట్టలను కలిగి ఉంది. ఆయా ప్రాంతాల్లో సహజంగానే పిడుగులు పడుతుంటాయి. సముద్ర తీరానికి దూరంగా ఉన్న ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. గాలిలో విచ్ఛిన్నత అధికమైన వాతావరణంలో పిడుగులు పడే ప్రమాదం ఎక్కువని పరిశోధకులు చెబుతున్నారు. ఈ కారణంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎక్కువగా పిడుగుపాటు ఘటనలు సంభవిస్తున్నాయి. ఇలాంటప్పుడు వాతావరణం మార్పులను బట్టి జాగ్రత్తపడటం, పొంచిఉన్న ప్రమాదాన్ని యాప్‌ల సాయంతో పసిగట్టడం ద్వారా ప్రాణాల్ని కాపాడుకోవచ్చు.



ఈ జాగ్రత్తలే రక్ష: సుమన్, కేవీకే వాతావరణ విభాగం పర్యవేక్షకుడు



ఉరుములు, మెరుపులప్పుడు ఎత్తైన ప్రదేశాల్లో, చెట్ల కింద, భవనాలపై, వెల్లడిగా ఉండే మైదాన ప్రదేశాల్లో ఉండకూడదు. విద్యుత్తు నియంత్రికలు, స్తంభాలు, లోహపు పనిముట్లు, వ్యవసాయ పంపుసెట్లకు దూరంగా ఉండాలి. శరీరం జలదరింపునకు గురవుతున్నా.. దగ్గర్లోని లోహపు వస్తువులు ఊగుతున్నా అది పిడుగుపాటు సంకేతంగా భావించాలి. బహిరంగ ప్రదేశాల్లో ఉంటే మోకాళ్ల మధ్య తల ఉంచి కూర్చొని, రెండు చేతులతో చెవులు మూసుకోవాలి. అటవీ ప్రాంతంలో ఉన్నట్లయితే మరుగుజ్జు, చిన్నగా ఉన్న చెట్లకింద మాత్రమే కూర్చోవాలి. మెరుపులు బాగా వచ్చేటప్పుడు ఇంట్లోని సభ్యులంతా ఒకేచోట కూర్చోవద్దు. దూరందూరంగా ఉంటే ప్రమాద తీవ్రత తగ్గుతుంది. ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ ఉపకరణాల ప్లగ్‌లను తీసి ఉంచాలి. సెల్‌ఫోన్‌ను ఉపయోగించొద్దు. ఉరుముల సమయంలో స్నానాలు చేయొద్దు. ప్రయాణ సమయంలో కార్లలోంచి కిందకు దిగొద్దు. తడి కంటే పొడి ప్రదేశంలో ఉండటం మంచిది. నీళ్లల్లో ఉంటే సాధ్యమైనంత త్వరగా బయటకు రావాలి.

ప్రాణ, ఆస్తినష్టం అపారం..

మీకు తెలుసా?

ఆకాశంలో వేగంగా కదిలే మేఘాలు ఒకదాన్ని మరొకటి ఢీకొన్నప్పుడు విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. దాని ప్రసరణకు ఒక వాహకం అవసరం. భూమ్యాకర్షణతో పిడుగు రూపంలో నేలపైకి విద్యుత్తు ప్రసరిస్తుంది. దీని శక్తి సూర్యుని ఉపరితల శక్తి కన్నా చాలా రెట్లు ఎక్కువని పరిశోధనల్లో తేలింది. మేఘాలు, భూమికి మధ్య ఉండే గాలి పిడుగును నేలవైపునకు చేర్చుతుంది. ఒక పిడుగుతో 30 కోట్ల వోల్టుల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. అందుకే అపార ప్రాణ, ఆస్తినష్టాలు సంభవిస్తాయి.

ప్రమాదాన్ని ముందే గుర్తించొచ్చు..

ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగులు ఎక్కడ పడే అవకాశం ఉందో భారత వాతావరణ విభాగం (ఐఎండీ), భూశాస్త్ర మంత్రిత్వ శాఖ (ఎంఓఈఎస్) ముందే హెచ్చరిస్తోంది. ఇందుకోసం damini lighting alert అనే ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. మొబైల్ ఫోన్లో గూగుల్ ప్లే స్టోర్, లేదా యాపిల్ యాప్ స్టోర్‌లోకి వెళ్లి ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. పేరు, మొబైల్ నంబరు, చిరునామా, పిన్ కోడ్ వంటి వివరాలు రిజిస్టర్ చేసుకోవాలి. ఆ తర్వాత మీరున్న ప్రాంతానికి చుట్టూ 40 కిలో మీటర్ల పరిధిలో ఒక సర్కిల్ యాప్‌లో కనిపిస్తుంది. పిడుగు ఎంత సేపట్లో పడుతుంది అనే హెచ్చరికలను మూడు రంగుల్లో (ఎరుపు, పసుపు, నీలంరంగు) సూచిస్తారు.



చెక్కు అందజేస్తున్న సీపీ సునీల్‌దత్

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: కొణిజర్ల పోలీసు స్టేషన్ విధుల్లో ఉన్న 2000 బ్యాచ్ హెడ్ కానిస్టేబుల్ ఈ. లోకేశ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పని చేస్తున్న తోటి బ్యాచ్ సిబ్బంది తమవంతు సాయంగా రూ.2 లక్షల చెక్కును పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. అందరితో కలివిడిగా ఉండే ఆప్తమిత్రునికి వారంతా అండగా నిలిచి పిల్లల భవితకు భరోసా కల్పించారు. వారిని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు.

అన్నం ఆశ్రమానికి 10 క్వింటాళ్ల బియ్యం వితరణ

ఖమ్మం అర్బన్: నగరంలోని అన్నం సేవాశ్రమానికి రోటరీనగర్ వాసవి క్లబ్ సభ్యుడు కేసా సత్యం 10 క్వింటాళ్ల బియ్యం వితరణగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు, నాగుల్‌మీరా, వాసవీ క్లబ్ సభ్యులు సోమా శేషగిరిరావు, హన్మంతరావు, వినోద్‌కుమార్, శ్రీనివాసరావు, రమేశ్, వెంకటేశ్వరరావు, బసవయ్య పాల్గొన్నారు.



ఆశ్రమానికి బియ్యం అందజేస్తున్న సభ్యుడు కేసా సత్యం తదితరులు

రాములోరికి ఘనంగా తిరుమంజనం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం తిరుమంజనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన ఆలయంలో కొలువైన కోదండ రాముడికి అర్చకులు సుప్రభాతం పలికారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం విష్వక్సేన పూజ పుణ్యాహవాచనం నిర్వహించారు. మాంగళ్యధారణ తలంబ్రాల వేడుక పరమానందం కలిగించింది. దర్బారు సేవలో హరిదాసులు ఆలపించిన కీర్తనలు ఆధ్యాత్మికతను నింపాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించి కానుకలను సమర్పించారు. గురువారం పునర్వసును పురస్కరించుకుని ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం ఉంటుంది.

కాంతులీనేందుకు దీపాంతలు సిద్ధం



యంత్రంపై దీపాంతల తయారీలో నిమగ్నమైన మహిళ, ప్రమిదలను ఆరబెడుతున్న వృత్తిదారులు

మరో వారం రోజుల్లో వెలుగుల పండగ దీపావళి రానుంది. బాణసంచాతోపాటు దీపాలు వెలిగించడం సంప్రదాయం. ఇప్పటికే విపణిలో దీపావళి సందడి మొదలైంది. శాలివాహనులు దీపాంతల తయారీలో నిమగ్నమయ్యారు. ఇంటిల్లిపాది వీటిని తయారు చేసి ఆరబెట్టి కాల్చి విక్రయించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఖమ్మం నగరంలోని ప్రకాష్‌నగర్ కుమ్మరివాడలో 60కి పైగా కుటుంబాలు ఉన్నాయి. కొందరు చేతులతో, కొంతమంది యంత్రాలపై వీటిని మలుస్తున్నారు. దీపావళి దీపాంత (ప్రమిద)ల తయారీలో ఇలా నిమగ్నమైన చిత్రాలను 'ఈనాడు' కెమెరా బంధించింది.

- ఈనాడు, ఖమ్మం

ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థకు జరిమానా

ఈనాడు, హైదరాబాద్: సరైన ఆధారాలు లేకుండా బీమా క్లెయిమ్‌ను తిరస్కరించటంపై ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థకు రాష్ట్ర వినియోగదారుల కమిషన్ మొట్టికాయలు వేసింది. పూర్తి బీమా మొత్తాన్ని చెల్లించాలంటూ ఖమ్మం జిల్లా వినియోగదారుల కమిషన్ ఇచ్చిన తీర్పును సమర్థించింది. భద్రాద్రి జిల్లా గుండాల మండలం శెట్టిపల్లికి చెందిన జనగాం అంకులు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన స్కీమ్, జీవన్ అభయలో చేరారు. ఇందులో చేరిన మూడేళ్లకు అంకులు మరణించడంతో నామినీగా ఉన్న అతడి కుమారుడు సాంబయ్య క్లెయిమ్ కోసం అభ్యర్థించారు. సరైన ఆధారాలు చూపకుండా క్లెయిమ్ నిరాకరించడంతో సాంబయ్య ఖమ్మం జిల్లా కమిషన్‌ను ఆశ్రయించారు. సానుకులంగా తీర్పు రావడంతో ప్రతివాద బీమా సంస్థ రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో అప్పీల్ వేసింది. సుదీర్ఘ విచారణ అనంతరం రాష్ట్ర వినియోగదారుల కమిషన్ జిల్లా కమిషన్ తీర్పును సమర్థిస్తూ అంకులు మరణానంతర ప్రయోజనాలు ఇవ్వాలని బీమా సంస్థను ఆదేశించింది.

సందర్శకుల సంఖ్య పెరిగేలా చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

ఖమ్మం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరం వెలుగుమట్లలోని అటవీశాఖ అర్బన్ పార్కుకు సందర్శకుల సంఖ్య పెంచే దిశగా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్‌తో కలిసి బుధవారం పార్కును సందర్శించారు. 'నగర సిగలో అరణ్య హొయలు' శీర్షికతో ఈనెల 4న, 'పేరుకే ఉద్యానం.. ఆటపాటలకు ఆగమాగం' శీర్షికన ఈనెల 17న 'ఈనాడు' కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ వార్తలకు స్పందించిన కలెక్టర్ అర్బన్ పార్కులో కమాండర్ జీపులో సుమారు 4 కి.మీ. మేర ప్రయాణించారు. గోల్డెన్ ఓరియంటల్ టవర్ ఎక్కి పార్కు చుట్టుపక్క ప్రాంతాలను పరిశీలించారు. ప్రతి రోజూ పార్కుకు ఎంత మంది సందర్శకులు వస్తున్నారు, ఎంత ఆదాయం సమకూరుతుంది, పార్క్ నిర్వహణకు అవుతున్న ఖర్చు తదితర వివరాలను జిల్లా అటవీశాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. పార్కులోని యోగా షెడ్డు, పిల్లల ఆటస్థలం, నక్షత్ర వనం, రాశీ వనం, ఓపెన్ జిమ్, ల్యాండ్ స్కేప్ గార్డెన్, బటర్ ఫ్లై గార్డెన్, సైక్లింగ్ షెడ్, అడ్వెంచర్ స్పోర్ట్స్, వాచ్ టవర్‌లను సరిగా వినియోగిస్తూ సందర్శకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పార్కులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆహ్లాదంగా గడిపేలా కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. బస్‌స్టాండ్ నుంచి పార్కు వరకు మినీ బస్సు నడిపే ప్రతిపాదన పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓ మంజుల, ఎఫ్‌ఆర్‌ఓ శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ ఎఫ్‌ఆర్‌ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, చిత్రంలో అదనపు కలెక్టర్ శ్రీజ, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్

– న్యూస్‌టుడే, ఖమ్మం వ్యవసాయం, ఈనాడు, ఖమ్మం

గుండెపోటుతో యువకుడి మృతి



సాయికిశోర్

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: జన్మదినం రోజే గుండెపోటుతో యువకుడు మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... నామవరం గ్రామానికి చెందిన శివాలయ అర్చకుడు శివరామమూర్తి రెండో కుమారుడు సాయికిశోర్(28) రాజాపురంలో నెట్ సెంటర్ నిర్వహిస్తున్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా ఇంట్లో ఉదయం తలస్నానం చేసేందుకు వెళ్లే క్రమంలో గుండెపోటు రావటంతో కుప్పకూలారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన కొత్తగూడెంలోని ఓ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందారు.

చెల్లని చెక్కు కేసులో ఆర్నెల్ల జైలు

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు కేసులో తల్లాడ మండలం పినపాక గ్రామానికి చెందిన ఎన్. అప్పారావుకు 6 నెలల జైలుశిక్ష విధించారు. ఫిర్యాదుదారుకు రూ.8 లక్షలు చెల్లించాలని ఆదేశించారు. ఈ మేరకు ఖమ్మం మూడో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి వి.మాధవి బుధవారం తీర్పు చెప్పారు. కొణిజర్ల మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన ఫిర్యాదుదారు జె.సత్యనారాయణ తన న్యాయవాది ఆవుల రఘురామయ్య ద్వారా దాఖలు చేసిన కేసులో ఈ తీర్పు వెలువరించారు.

మిలీషియా సభ్యులు అరెస్టు



మిలీషియా సభ్యులు పొడియం కమ్లు, మడకం సోంబారు

దుమ్ముగూడెం, చర్ల, న్యూస్‌టుడే: దుమ్ముగూడెం మండలం పెదబండిరేవు గ్రామంలో పట్టుబడిన ఇద్దరు మావోయిస్టు మిలీషియా సభ్యులను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ అశోక్ కథనం ప్రకారం... స్థానిక ఎస్సై వెంకటప్పయ్య తన సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ జవాన్లతో పెదబండిరేవు క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో ఇద్దరు వ్యక్తులు తెల్లటి సంచులు తీసుకొని పెదబండిరేవు వైపు అనుమానాస్పదంగా వెళ్తున్నారు. వెంటనే వీరిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గంపూర్ గ్రామానికి చెందిన పొడియం కమ్లు అలియాస్ రాజ్‌కుమార్, మడకం సోంబారు అనే వీరు ఆర్‌పీసీలో మావోయిస్టు మిలీషియా సభ్యులుగా వెల్లడైంది. గంగలూరు ఏరియా కమిటీ సెక్రటరీ మొడియం దినేష్ వద్ద సుమారు రూ.20 వేలు తీసుకొని పేలుడు పదార్థాలు కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కుక్కునూరు గ్రామానికి వచ్చి మిరప తోటల్లో కూలీ పనులు చేస్తున్నారు. ఈనెల 22వ తేదీన కార్డెక్స్ వైర్లను తీసుకొని దినేష్‌కు ఇవ్వడానికి వీరిద్దరు కుక్కునూరు నుంచి బయలుదేరినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి సుమారు 50 మీటర్ల పొడవు కలిగిన కార్డెక్స్ వైరు రూ.11,500 నగదును స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు.

జవాన్ సోదరుడిపై దాడి : దంతెవాడ జిల్లా హిరోలీ గ్రామానికి చెందిన దేవా దంతెవాడలో జవాన్‌గా పని చేస్తున్నాడు. ఇతను సెలవుపై ఇంటికి వచ్చిన విషయాన్ని తెలుసుకున్న మావోయిస్టులు మంగళవారం అర్ధరాత్రి దాడి చేయడానికి వచ్చారు. మావోయిస్టులు ఇతని ఇంటికి వచ్చి దేవాను పిలవడంతో వెంటనే ఇతని సోదరుడు కుంజాం లక్ష్మణ్ బయటకు వచ్చాడు. అతన్ని దేవాగా భావించిన మావోయిస్టులు కత్తులతో దాడి చేసి పారిపోయారు. తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే జగదల్‌పూర్‌లోని డిమ్రాపాల్ మెడికల్ ఆసుపత్రికి తరలించారు.

ఆధార్ తరహాలో.. విద్యార్థులకు అపార్

నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు ప్రవేశపెడుతోంది. విద్యార్థులకు ఓ ప్రత్యేక గుర్తింపు కార్డును తెచ్చేందుకు తాజాగా నిర్ణయించింది. అందరికీ ఆధార్ తరహాలో ఓ కార్డు జారీ చేసే ప్రక్రియను ప్రారంభించింది. దాని పేరే.. 'అపార్' (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమి అకౌంట్ రిజిస్ట్రీ).

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే

ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు విద్యాలయాల వారీగా వివరాలను వేర్వేరుగా నమోదు చేసే ప్రక్రియ ప్రస్తుతం అమలులో ఉంది. దీనికి బదులుగా 'వన్ నేషన్-వన్ స్టూడెంట్' లక్ష్యంతో అన్ని రకాల విద్యాసంస్థల్లోనూ కేజీ నుంచి పీజీ వరకు ప్రతి విద్యార్థికి గుర్తింపు కార్డును జారీ చేయడమే నూతన విధానం. 12 సంఖ్యలతో మంజూరు చేయనున్న 'అపార్' ఐడీలో విద్యార్థుల సమగ్ర వివరాలను పొందుపరచాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో పూర్తి వివరాల నమోదుకు సంబంధించి రాష్ట్ర విద్యాశాఖ అన్ని జిల్లాల అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని 'యూ-డైస్ ప్లస్ (డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్)'లో నమోదు చేశారు. ఒక్కో విద్యార్థికి ఒక 'పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్'(పెన్)ను కేటాయించారు. యూడైస్ ప్లస్ ఆధారంగా అపార్ కార్డులు అందించేలా డీఈవోల ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు.

	పాఠశాలలు	విద్యార్థులు
ఖమ్మం..	1,616	2,18,005
భద్రాద్రి..	1,665	1,69,742

విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

వెంకటేశ్వరాచారి, డీఈవో, భద్రాద్రి కొత్తగూడెం

'అపార్' కార్డు ప్రాముఖ్యతపై విద్యాలయాల్లో ఈ నెల 19న నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో విశదపరిచాం. పాఠశాలల యాజమాన్యాలకు ముఖ్య సూచనలు తెలియజేశాం. ప్రతి విద్యార్థి సమగ్ర సమాచారం ఒక్క క్లిక్‌కు అందుబాటులో ఉంటుంది.



ప్రత్యేకత ఇదీ..

- ఈ కార్డులో భాగంగా విద్యార్థులు సాధించిన విజయాలు, మార్కుల వివరాలు, మెమోలు, ఉపకార వేతనాలు, నైపుణ్యాలను సంక్షిప్తంగా నమోదు చేస్తారు.
- ఇది ఒక విద్యార్థి జీవిత కాల గుర్తింపు కార్డుగా పరిగణిస్తారు. ఆధార్‌తో అనుసంధానిస్తారు.
- ఎప్పుడు అవసరమైనా విద్యార్థుల సమగ్ర వివరాల ఒకే గొడుగు కింద, అధీకృతంగా లభిస్తాయి. దీనివల్ల కోర్సుల్లో ప్రవేశాలు పొందే సమయంలో పదే పదే ధ్రువపత్రాలు సమర్పించాల్సిన అవసరం ఉండదు. కార్డ్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సరిపోతుంది.
- ప్రవేశ పరీక్షలకు సంబంధించి పూర్తి వివరాలకు బదులు 12 అంకెల సంఖ్యను నమోదు చేస్తే సరిపోతుంది.
- కాకపోతే కార్డు జారీ చేసే ముందు విద్యార్థుల తల్లిదండ్రుల సమ్మతిని తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ దీన్ని తీసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలి.

వద్దన్నా వినలేదు.. పట్టాలపై శవమయ్యాడు..

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: పాల్వంచ కరకవాగు సమీపంలో రైలు పట్టాలపై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక గాంధీనగర్‌కు చెందిన షేక్ యాకూబ్ పాషా(31) రైల్వే ట్రాక్ వద్ద కూర్చుని సాయంత్రం 4.30 నుంచి మద్యం తాగాడు. ఆ సమయంలో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. ఇది గమనించిన స్థానికులు, రైల్వే ఉద్యోగులు.. 'కాసేపట్లో రైలు వస్తుందని, ఇక్కడ్నుంచి పక్కకు వెళ్లాలని' హెచ్చరించారు. రాత్రి 7 గంటల సమయంలో పాయింట్ మెన్ ట్రాక్‌ను గమనిస్తున్న సమయంలో పట్టాలపై యాకూబ్ పాషా మృతదేహం చెల్లాచెదురై కనిపించింది. స్థానికుల సమాచారంతో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పాల్వంచ ఏరియా ఆసుపత్రి శవాగారానికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరావడం లేదని మృతుడి బంధువులు తెలిపారు. మృతుడి భార్య సన ఫిర్యాదుతో ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు మగ పిల్లలు.



షేక్ యాకూబ్ పాషా

1 నుంచి అమరవీరుల సంస్మరణ సభలు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: భూమి, భుక్తి, విముక్తి కోసం జరుగుతున్న పోరాటంలో ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరిస్తూ నవంబరు 1 నుంచి 9 వరకు గ్రామగ్రామాన సంస్మరణ సభలు నిర్వహించాలని ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్డీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'భూస్వాముల చెరలో చిక్కిన వేల ఎకరాలను పేదలకు పంచిపెట్టిన చరిత్ర విప్లవోద్యమం సొంతం. ఆయా పోరాటాల్లో బత్తుల వెంకటేశ్వర్లు, చంద్ర పుల్లారెడ్డి, కాచనపల్లి అమరవీరులు ఎల్లన్న, సురేశన్న, బాటన్న, లింగన్న, మురళి, ముక్తార్ పాషా, బొర్ర వీరస్వామి, పగడాల వెంకన్న, తుడుం రామయ్య వంటి వారెందరో ప్రాణాలర్పించారు' అని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, నాయకులు గౌని నాగేశ్వరరావు, సారంగపాణి, శ్రీనివాసరావు, ఉపేందర్, మోకాళ్ల రమేశ్, మోతీలాల్, ఇర్ప రాజేశ్ పాల్గొన్నారు.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్త పత్తి	6,000	7,100	6,800
పెసలు	6,050	7,000	6,800
మొక్కజొన్నలు	2,251	2,251	2,251
ఏసీ ఎండుమిరప	10,500	19,000	17,400
ఎండుమిరప	9,000	17,000	14,700
ఏసీతాలుమిరప	7,000	8,500	7,000

చికెన్ ధరలు వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర •వైరా



శ్రీవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే సండ్ర, కుటుంబ సభ్యులు

కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి, న్యూస్‌టుడే: ఏపీలోని తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామిని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య బుధవారం దర్శించుకున్నారు. ఇటీవల సండ్ర తనయుడు భార్గవ్, సాయిచిద్వితల వివాహం కాగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులచే వేదాశీర్వచనం తీసుకున్నారు.

26న మధిరకు హైకోర్టు న్యాయమూర్తుల రాక

మధిర, న్యూస్‌టుడే: మధిర పాత కోర్టు ఆవరణలో నూతనంగా నిర్మించబోయే రెండు కోర్టు భవనాలు, రికార్డురూమ్‌లకు శంకుస్థాపన చేసేందుకు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శ్రీసుధ, జస్టిస్ నగేశ్, జస్టిస్ శరత్ ఈ నెల 26న మధిరకు రానున్నారు. క్లబ్ కాంప్లెక్సులో ఏర్పాటు చేసిన సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభించనున్నట్లు మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజెడ్ల పుల్లారావు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
సత్తుపల్లి : 93922 39905
మధిర : 98668 05652
వైరా : 76619 46938

సమస్య: మండలంలోని రేగళ్లపాడు ప్రాథమిక పాఠశాల రహదారి మూలమలుపు వద్ద మురుగునీరు రోడ్డుపై పారుతోంది.
- స్థానిక, గ్రామస్థుడు

సమాధానం: సమస్య మా దృష్టికి వచ్చింది. కాలువ తీయించి సమస్యను పరిష్కరిస్తాం. **- ఎస్.శివమాధవరావు, పంచాయతీ కార్యదర్శి, రేగళ్లపాడు**

– సత్తుపల్లి, న్యూస్‌టుడే

విద్యుత్తు శాఖ ఏఈలుగా బాధ్యతల స్వీకరణ



రామిరెడ్డి



వెంకట్

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు మండలంలోని కల్లూరు, పెద్దకోరుకొండి విద్యుత్తు ఉప కేంద్రం ఏఈగా పి.వెంకట్, రామిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కల్లూరు, పెద్దకోరుకొండిల్లో విధులు నిర్వహించిన గణేశ్ మామునూరు, తిరుపతయ్యలు ఖమ్మానికి బదిలీ కాగా వారి స్థానంలో వీరు బాధ్యతలు చేపట్టారు.

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ గ్రామీణ ఏఈగా ఎస్.మైథిలి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ గ్రామీణ ఏఈగా పని చేసిన నాగేశ్వరరావు ఖమ్మం అర్బన్ ఏఈగా బదిలీ కావటంతో వారి స్థానంలో మైథిలి బాధ్యతలు స్వీకరించారు. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్తు సరఫరా చేస్తామని తెలిపారు.

కారేపల్లి: కారేపల్లి అడ్డరోడ్డు విద్యుత్తు ఉపకేంద్రం ఏఈగా వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన విజయ్‌కుమార్ ఖమ్మం బదిలీ అయ్యారు.

అద్దె భవనంలో ఇంకెన్నాళ్లో?



అసంపూర్తి నిర్మాణంతో కార్యాలయం

మధిర, న్యూస్‌టుడే: ప్రభుత్వానికి ఆదాయం తెచ్చే ఎక్సైజ్ కార్యాలయం మూడు దశాబ్దాలుగా మధిరలో అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ప్రస్తుత కార్యాలయ భవనంలోకి ఇటీవల వర్షానికి వరద నీరు చేరి కార్యకలాపాలకు అసౌకర్యం కలిగింది.

85 శాతం పనులు పూర్తి

నిజాం కాలం నుంచి మధిరలో ప్రభుత్వ ఆసుపత్రి పక్కన ఎక్సైజ్ కార్యాలయం ఉండేది. అది శిథిలం కావడంతో ప్రైవేటు భవనంలోకి మార్చారు. ప్రతి నెలా అద్దె రూపంలో రూ.10వేలు చెల్లిస్తున్నారు. మూడేళ్ల కిందట పాత ఎక్సైజ్ కార్యాలయం స్థలంలో నూతన భవనాన్ని నిర్మించేందుకు రూ.35 లక్షల నిధులు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. సంబంధిత గుత్తేదారు ఆ నిధులతో దాదాపు 85 శాతం మేర పనులు పూర్తి చేశారు. మంజూరైన బడ్జెట్‌కు మిగతా పనులు చేసేందుకు సరిపోలేదు. ఇప్పటి వరకు రెండు అంతస్తుల నిర్మాణం పూర్తయ్యింది. ప్లాస్టరింగ్, విద్యుత్తు, ప్లమ్మింగ్ పనులు పూర్తి చేశారు. భవనాన్ని పూర్తి స్థాయిలో నిర్మించేందుకు మరికొంత నిధుల అవసరం ఉంది. దర్వాజలు, కిటికీలు, టైల్స్, గేట్ నిర్మాణంతో పాటు లోపలి భాగంలో సీసీ రోడ్డును ఏర్పాటు చేయాల్సి ఉంది. నిధుల కోసం మంత్రులు, కలెక్టర్, సంబంధిత అధికారులను కలిసి పరిస్థితిని వివరించారు. నిధులు మంజూరు చేస్తే పనులు పూర్తి చేసి సొంత భవనాన్ని వినియోగించుకునే అవకాశం ఉంది.

ప్రతిపాదనలు పంపాం

ఎక్సైజ్ సీఐ జంపాల రామ్మూర్తి

ఎక్సైజ్ భవనాన్ని పూర్తి స్థాయిలో నిర్మించేందుకు మరో రూ.15 లక్షల నిధుల కోసం ప్రతిపాదనలు అధికారులకు పంపాం. మంజూరు కాగానే రెండు, మూడు నెలల్లో నిర్మాణం పూర్తి చేసి నూతన భవనంలో కార్యాలయాన్ని ప్రారంభిస్తాం.

కాల్వలో తుంగ తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: జాలిముడి గ్రామం వద్ద రైతులకు సాగు నీరు అందించటం కోసం ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మించి కాల్వలు ఏర్పాటు చేసింది. నీరు పారకుండా పంట కాల్వలో తుంగ పెరగటంతో ఈ నెల 22న 'ఇలా ఉంటే నీరు పారేదెలా' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన నీటి పారుదల శాఖ డీఈ నాగబ్రహ్మయ్య, అధికారులు సిబ్బందితో కాల్వలో తుంగ తొలగిస్తున్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించండి

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యాధినిరోధక టీకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని దెందుకూరు పీహెచ్‌సీ కమ్యూనిటీ వైద్యాధికారి వడ్లమూడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. దెందుకూరు పీహెచ్‌సీలో టీకాల కార్యక్రమం నిర్వహించారు. 5 సంవత్సరాల వయసు వచ్చే వరకు పిల్లలకు టీకాలు క్రమం తప్పకుండా వేయించాలన్నారు.

గంగారం బెటాలియన్‌లో వ్యాసరచన పోటీలు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో బుధవారం పోలీస్ ఫ్లాగ్‌డే దినోత్సవాల్లో భాగంగా సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కమాండెంట్ పీజేపీసీ చటర్జీ మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి ఏడాది పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సిబ్బంది, అధికారులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. అసిస్టెంట్ కమాండెంట్ ఎస్‌డీ రంగారెడ్డి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒరిగిన స్తంభాలు.. పట్టింపులేని అధికారులు!



మల్లారం నుంచి జాలిముడి రహదారిలో పొలాల పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. సరి చేయించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. సమస్య మా దృష్టికి రాలేదని, పరిశీలించి విద్యుత్తు స్తంభాలు సరిచేయిస్తామని గ్రామీణ ఏఈ మైథిలి తెలిపారు. – మధిర గ్రామీణం, న్యూస్‌టుడే

ట్రాఫిక్‌తో వాహనదారుల అవస్థ?



మధిరలోని ఆర్వోబీపై తరచూ ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఆర్వోబీ మరమ్మతు పనులకు రూ.78లక్షలు మంజూరు కావడంతో వారం రోజుల కిందట పనులు ప్రారంభించారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన నైపుణ్యం కల్గిన కూలీలతో పనులు చేయిస్తున్నారు. తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తి ఇరువైపులా వాహనాలు నిలిచిపోతుండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈ రాంబాబు మాట్లాడుతూ.. సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది. తమ సిబ్బందే దగ్గరుండి ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తారని, అవసరమైతే పోలీసులకు లేఖ రాసి ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. – మధిర, న్యూస్‌టుడే

మురుగు ఇలా.. వైద్యం చేసేదెలా?



చెన్నూరు పశు వైద్యశాలలో మురుగు నీరు నిలుస్తోంది. పశువులకు వైద్యం చేయించడానికి వస్తున్న పశు యజమానులు ఇబ్బందులు తప్పడం లేదు. పశువైద్యశాల డా.మమతను వివరణ కోరగా.. 1976లో వైద్యశాల నిర్మించడంతో వీధి కన్నా లోతట్టులో ఉండటంతో మురుగు వచ్చి చేరుతోంది. పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. – కల్లూరు, న్యూస్‌టుడే

అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

సత్తుపల్లి: సత్తుపల్లి శివారులోని శ్రీహరిహరాత్మజ అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుర ఛైర్మన్ కూసంపూడి మహేశ్ అయ్యప్పస్వామి మండల మాలాధారణ స్వీకరించారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

పెనుబల్లి, న్యూస్‌టుడే: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సహకారంతో పెనుబల్లి జూనియర్ కళాశాలలో బుధవారం పోలూరి రాము జానపద కళాబృందంచే హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపైన, 1097 టోల్‌ఫ్రీ నంబర్ విశిష్టత ఏఆర్టీ మందుల ప్రాధాన్యతను పల్లెశుద్దులు, నాటికల ద్వారా అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ రత్నాకర్, హెల్త్ సూపర్‌వైజర్ పొట్టెమ్మ, కళాకారులు పోలూరి రాము, కొచ్చర్ల గురవయ్య, రాంబాబు, గుంటి గురవయ్య, ఆశ కార్యకర్తలు నాగమణి పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: మండల టీపీటీఎఫ్ కమిటీ ఎన్నిక సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.విజయ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా పి.భూషణ్‌రాజు, ఎ.దామోదర్‌రావు ఎన్నికయ్యారు. విజయ్ మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, డీఏ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెంకగళవారు, సీతారాములు, హనుమంతరావు, ముత్తయ్య, శ్యామ్‌సుందర్, సంధ్యారాణి, ఉమాదేవి పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముదిగొండ, న్యూస్‌టుడే: నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తలక్ష్మీపురం సమీపంలోని పత్తి మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రం బుధవారం ప్రారంభించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇన్‌ఛార్జి దయాకర్‌రెడ్డి, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెన్నెపూసల సీతరాములు, నాయకులు సంజీవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, అనంతరెడ్డి, కన్నయ్య, ఉపేందర్, రఫి పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లిలోని గుడిపాడుకు చెందిన వైద్య విద్యార్థిని రాజిని శివభార్గవికి దాతలు ఆర్థికసాయం అందిస్తున్నారు. బెంగళూరుకు చెందిన మనోజ్‌కుమార్ రూ.60వేలు ఫోన్‌పే ద్వారా, మరో దాత రూ.50వేలను స్వయంగా విద్యార్థిని ఇంటికెళ్లి బుధవారం అందజేశారు. స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 1979-82 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రమణ, కృష్ణయ్య, సోమిరెడ్డి, అల్వాల శ్రీను, విశ్వనాథం రూ.10వేలు, రుద్రాక్షపల్లికి చెందిన నాయకపోడు నాయకులు కూసిన శ్రీనివాస్, కురం గోపాలకృష్ణ, పాండ్ల వెంకటేశ్వరరావు రూ.10వేలు అందజేశారు.


'ఆడపిల్లలను రక్షిద్దాం.. ఆడపిల్లలను చదివిద్దాం'

మధిర గ్రామీణం: 'ఆడపిల్లలను రక్షిద్దాం.. ఆడపిల్లలను చదివిద్దాం' అని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సామాజిక కార్యకర్త నంద్యాల ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని దెందుకూరు హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులతో బుధవారం ముచ్చట్లు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్లలు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహాదేవపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఐశ్వర్య, కుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందుకోవాలి

వైరా, న్యూస్‌టుడే: అర్హులైన దివ్యాంగులు సంక్షేమ పథకాలను అందుకోవాలని దివ్యాంగ కార్యాలయం జూనియర్ అసిస్టెంటు వేణుగోపాల్ పేర్కొన్నారు. వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బహుజన అభ్యుదయ సేవా సమితి అధ్యక్షురాలు ఆదూరి మణి ఆధ్వర్యంలో దివ్యాంగులకు హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆనంద్, మహేంద్రనాథ్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు మృతి



ఎర్రుపాలెం: తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు అయిలూరి రామిరెడ్డి(85) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రామిరెడ్డి భౌతిక కాయానికి డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం..



దాత కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తల్లాడ, న్యూస్‌టుడే: కేశ్వాపురం గ్రామంలోని శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయం ప్రధాన మండపం చుట్టూ గ్రిల్స్ వేసేందుకు అవసరమైన ఆర్థికసాయాన్ని గ్రామానికి చెందిన చావా నరసింహారావు-జయమ్మ దంపతుల కుమారుడు, ప్రవాస భారతీయుడు చావా అమర్‌చందు-స్వాతి దంపతులు ముందుకొచ్చారు. బుధవారం దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలను కలిసి రూ.1.5లక్షల నుంచి రూ.2లక్షలు వరకు అందిస్తామని చెప్పారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు కట్టా రమాకాంత్, మాజీ సర్పంచి వనిగండ్ల అలేఖ్య, వెంకటేశ్వరరావు, రామారావు, నాగేశ్వరరావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కుంభకోణం నిరూపితమైనా.. చర్యలేవీ

★ లాలాపురం రైస్‌మిల్లు ఎదుట సీపీఎం నాయకుల ఆందోళన

కొణిజర్ల, న్యూస్‌టుడే: లాలాపురం సమీపంలోని ఎస్‌ఏఆర్ రైసుమిల్లుకు సంబంధించి రూ.కోట్లలో కుంభకోణం నిరూపితమైందని అధికారులే తేల్చిన బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వ్య.కా.సం. రాష్ట్ర నాయకుడు తాళ్లపల్లి కృష్ణ ప్రశ్నించారు. రైతు సంఘం ఆధ్వర్యంలో రైస్‌మిల్లు ఎదుట బుధవారం ఆందోళన నిర్వహించారు. ఎస్‌ఏఆర్ మిల్లు ఆస్తులను ప్రభుత్వ స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ధాన్యం తీసుకుని బియ్యం ఇవ్వకుండా వాటిని విక్రయించి ఆ ప్రభుత్వ సొమ్ముతో మిల్లు నిర్వాహకులు వందలాది ఎకరాలు భూములు కొనుగోలు చేశారని ఆరోపించారు. నాయకులు చెరుకుమల్లి కుటుంబరావు, దొడ్డపనేని కృష్ణార్జునరావు, పురుషోత్తం, వీరభద్రం, సుధాకర్, నాగేశ్వరరావు, ఆనందరావు, రాంబాబు, ప్రసాద్, కృష్ణారావు, సాంబశివరావు, ఖాసీంబేగ్, సత్యనారాయణ, అఫ్జల్ పాల్గొన్నారు.



రైస్‌మిల్లు ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు, రైతులు

కుక్కల బెడద నివారణకు చర్యలు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లిలో కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటామని పుర ఛైర్మన్ కూసంపూడి మహేశ్ పేర్కొన్నారు. స్థానిక పుర కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం కమిషనర్ ఎం.రవిబాబు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య పరిరక్షణ చర్యలతో పాటు తాగునీటి ఎద్దడి లేకుండా జాగ్రతలు తీసుకోవాలని ఆదేశించారు. పుర వైస్ ఛైర్‌పర్సన్ తోట సుజలారాణి, కౌన్సిలర్లు సూరిబాబు, భవానీ, అనీస్, చాంద్‌పాషా, నాగలక్ష్మి, నాగులమీరా, రాంబాబు, రాఘవేంద్రరావు, సలీమాఖాతూన్, విజయనిర్మల పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

మధిర, న్యూస్‌టుడే: మధిర పురపాలికలో ప్రజా సమస్యలపై స్పందిస్తూ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని నూతనంగా విధుల్లో చేరిన పుర కమిషనర్ ఎ.సంపత్‌కుమార్ బుధవారం పేర్కొన్నారు. సిబ్బంది తక్కువగా ఉన్నప్పటికీ పారిశుద్ధ్యం విషయంలో ఎటువంటి లోపాలు లేకుండా చూస్తామని చెప్పారు. పురపాలికలో విలీనమైన మడుపల్లి, అంబారుపేట, ఇల్లెందులపాడు, దిడుగుపాడు గ్రామాల్లోనూ ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.

న్యాయం చేయాలని రైతుల వినతి

బోనకల్లు, న్యూస్‌టుడే: పంటనష్ట సర్వేలో అక్రమాలు చోటు చేసుకున్నాయని, అసలైన రైతులకు అన్యాయం జరిగిందని ఆళ్లపాడు, రాపల్లి రైతులు బుధవారం కలెక్టర్ ముజ్మిల్లాఖాన్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆళ్లపాడు, రాపల్లి, బోనకల్లు గ్రామాల్లో రైతులు మూడు రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. జేడీఏకి విచారణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



కలెక్టర్‌కు విన్నవిస్తున్న రైతులు

★ అక్రమాలకు పాల్పడిన వ్యవసాయాధికారుల్ని సస్పెండ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోట రామాంజనేయులు డిమాండ్ చేశారు. బోనకల్లులోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. రోషన్‌కుమార్, ఆనందరావు, పవన్ పాల్గొన్నారు.

భాషా పండితులను అప్‌గ్రేడ్ చేయాలి

ఏన్కూరు, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లు నమోదు చేసుకోవాలని కోరుతూ బుధవారం పలు గురుకులం, కేజీబీవీ పాఠశాలల్లో సంఘ నాయకులతో ఉపాధ్యాయులను కలిశారు. బి.రాంచందర్, శ్రీదేవి, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తల్లాడ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీకాంత్, జిల్లా నాయకుడు షేక్ రంజాన్ కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు నమోదు గురించి టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. షేక్ లాల్‌సయ్యద్, శ్రీనివాసరావు, మురళీకృష్ణ, కుర్నవల్లి హెచ్‌ఎం ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.



కుర్నవల్లి పాఠశాలలో ప్రచారం చేస్తున్న నాయకులు

శ్రీరామగిరిలో క్షేత్ర సందర్శన



శ్రీరామగిరిలో పంటలు పరిశీలిస్తున్న కేంద్ర సర్వీసుల బృందం

ఏన్కూరు, న్యూస్‌టుడే: శ్రీరామగిరిలో కేంద్ర సర్వీసుల బృందం సభ్యులు రెండో రోజు బుధవారం పంటలు పరిశీలించారు. వ్యవసాయశాఖ, వాటర్ షెడ్ ద్వారా రైతులకు కల్పిస్తున్న సదుపాయాలు, పంటల సాగుపై ఆయా శాఖల అధికారుల ద్వారా తెలుసుకున్నారు. సభ్యులు ఇషాన్‌గుప్తా, పంకజ్, అల్తాఫ్, అంకిత్‌యాదవ్, శుభం, మండల అధికారులు పాల్గొన్నారు.

కారేపల్లి: ఆలియాతండాలో కేంద్ర సర్వీసుల బృందం అల్తామాష్ గాజి, వైభవ్ మీనా, తేజస్విని, అనితామీనా, విపుల సింగాల్‌లు పర్యటించారు. అంగన్‌వాడీ, ఆరోగ్య ఉపకేంద్రం, రైతు వేదికలను సందర్శించారు.

చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠా అరెస్ట్

సత్తుపల్లి, న్యూస్‌టుడే: ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. సత్తుపల్లిలోని సబ్ డివిజన్ కార్యాలయంలో కల్లూరు ఏసీపీ ఎ.రఘు బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏపీలోని కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలుకు చెందిన ఎల్లబోయిన గోపితో పాటు అద్దంకి గురువయ్య, అద్దంకి శివ, ముంగి రాము, ముంగి కృష్ణ అలియాస్ కిట్టు, మరో మైనర్ కలిసి మంగళవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలపై వేంసూరు మండలం కందుకూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ చేసేందుకు రెక్కీ చేస్తూ అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై వీరప్రసాద్ సిబ్బందితో వెళ్లారు. పోలీసులను చూసి నిందితులు పారిపోయే ప్రయత్నం చేయడంతో వారిని పట్టుకుని విచారించడంతో విషయం బయటపడింది.



వివరాలు వెల్లడిస్తున్న కల్లూరు ఏసీపీ రఘు, చిత్రంలో సీఐ, ఎస్సైలు

☆ జల్సాలకు అలవాటుపడిన గోపి, మైనర్ కలిసి పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడి జైలు జీవితం గడిపారన్నారు. అచ్చంపేటలోని సత్తెమ్మతల్లి, వెంకటాపురంలోని అంకమ్మతల్లి ఆలయాల్లో చోరీలకు చేశారని చెప్పారు. 3.3కిలోల వెండి, రూ.1.50లక్షల నగదు, బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్రవాహనాలు, చోరీలకు ఉపయోగించే వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై, సిబ్బందికి నగదు ప్రోత్సాహకాలను ఏసీపీ అందజేశారు. సీపీ సునీల్‌దత్ సిబ్బందిని అభినందించారు. సీఐ లింగయ్య, ఎస్సైలు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల..: ద్విచక్రవాహనాల దొంగను పోలీసులు అరెస్టు చేశారు. ఏసీపీ ఎ.రఘు వివరాలు వెల్లడించారు. పెనుబల్లి మండలంలోని ఉప్పలచెలక సెంటర్‌లో ఎస్సై వెంకటేశ్ వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. బంజర్ నుంచి కొత్తగూడెం వైపునకు నంబర్ ప్లేట్ లేకుండా వెళ్తున్న స్కూటీని ఆపారు. విచారించగా తనది ఏపీలోని కృష్ణా జిల్లా గంపలగూడెం మండలం కనుమూరుకు చెందిన షేక్ మౌలాలీగా తేలింది. వ్యసనాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించడం కోసం దొంగతనాలకు పాల్పడుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు. 17న రాత్రి పాతకారాయిగూడెంలో ఇంటి ఆరుబయట నిలిపి ఉన్న స్కూటీని దొంగతనం చేసి తరలిస్తున్నట్లుగా దర్యాప్తులో తేలింది. గతంలో తిరువూరు బస్టాండ్‌లో పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్రవాహనాన్ని కూడా దొంగిలించగా ఆయా ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం రిమాండ్ విధించింది.

గల్లంతైన యువకుడు మృతి

ఎర్రుపాలెం: మామునూరుకు చెందిన వెంకటేశ్వరరావు(30) మంగళవారం రాజులదేవరపాడు సమీపంలోని కట్లేరులో చెక్‌డ్యాం వద్ద చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యారు. స్థానికులు ఎస్సైకి సమాచారం ఇవ్వడంతో రెస్క్యూ టీం ఆధ్వర్యంలో గాలించగా బుధవారం బనిగండ్లపాడు సమీపంలోని కట్లేరులో వెంకటేశ్వరరావు మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ముదిగొండ: ఖమ్మం నుంచి కోదాడ వైపునకు వెళ్తున్న కారు ముదిగొండ సమీపంలోని జాతీయ రహదారిపై కోదాడ వైపు నడుచుకుంటూ వెళ్తున్న జీజీబాయిషిండే అనే మహిళను ఢీకొంది. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆమెను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మెట్లపై నుంచి జారిపడి విద్యార్థినులకు..

పెనుబల్లి: కోతుల దాడి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఇద్దరు ఇంటర్ విద్యార్థినులు గాయపడిన ఘటన టేకులపల్లి ఆదర్శ కళాశాల వసతి గృహంలో చోటు చేసుకుంది. విద్యార్థిని చరిత స్టడీ అవర్ ముగించుకుని మెట్లపై పై అంతస్తుకు వెళ్తుండగా కోతులు ఎదురొచ్చి దాడికి ప్రయత్నించాయి. భయపడిన చరిత కోతుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో మెట్లపై నుంచి జారిపడగా గాయమైంది. గమనించిన సహ విద్యార్థిని వైష్ణవి చరితను తప్పించే ప్రయత్నంలో మెట్లపై నుంచి జారిపడగా వైష్ణవి కూడా తీవ్రంగా గాయపడింది. విద్యార్థినులను పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మోసపూరితంగా ఏటీఎం సొత్తు చోరీ

వైరా, న్యూస్‌టుడే: ఏటీఎంలో నగదు డ్రా చేసుకునే సమయంలో మోసపోయిన మరో ఘటన వైరాలో బుధవారం జరిగింది. కొణిజర్ల మండలం విక్రమ్‌నగర్‌కు చెందిన భూక్యా మదన్ పనిపై వైరా వచ్చాడు. నగదు అవసరం ఉండటంతో ఎస్‌బీఐ వద్ద ఉన్న ఏటీఎంలో నగదు చేసుకునేందుకు వెళ్లాడు. తనకు నగదు డ్రా చేయడం రాకపోవడంతో అక్కడే ఉన్న ఓ వ్యక్తి సాయపడతానంటూ ముందుకు రావడంతో తన ఎస్‌బీఐ ఏటీఎం కార్డు ఇచ్చాడు. గుర్తుతెలియని వ్యక్తి నగదు డ్రా చేసిస్తానని నమ్మబలికి పిన్ నెంబర్ తెలుసుకుని నగదు రావడం లేదంటూ నమ్మించాడు. కొద్ది క్షణాల వ్యవధిలోనే కార్డు మార్చి మదన్‌కు మరో కార్డు ఇచ్చి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. అరగంటలోనే రూ.40 వేలు డ్రా చేసినట్లు సందేశం రావడంతో బ్యాంకు అధికారులను సంప్రదించగా బోనకల్లు ఏటీఎం నుంచి నగదు డ్రా చేసినట్లు గుర్తించారు. నెల క్రితం ఇదే ఏటీఎం వద్ద ఓ మహిళను మోసగించి నగదు డ్రా చేసిన వ్యక్తే మళ్లీ మోసానికి పాల్పడినట్లు బ్యాంకు సిబ్బంది గుర్తించారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

సకల ఉద్యోగుల సమారాధన గోడపత్రిక ఆవిష్కరణ

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యోగ సంఘాల ఐకాస ఆధ్వర్యంలో నవంబరు 3న నిర్వహించనున్న సకల ఉద్యోగుల కార్తీక వన సమారాధన ప్రచార గోడపత్రికను ఖమ్మంలోని టీఎన్జీవో సంఘ భవనంలో బుధవారం సాయంత్రం ఐకాస నేతలు ఆవిష్కరించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లా, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు ఖమ్మం నుంచి వెళ్లే ఉద్యోగుల కుటుంబాలతో వన సమారాధన నిర్వహిస్తున్నామని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. చెరుకూరి మామిడితోటలో వన సమారాధన కార్యక్రమం జరుగుతోందని వివరించారు. ఉద్యోగ ఐకాస నాయకులు శ్రీరామ్ సత్యనారాయణ, కొణిదెన శ్రీనివాసరావు, గుంటుపల్లి శ్రీనివాస్, ఖైసర్, వేదర కొండ సైదులు, వై. వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు న్యాక్ బృందం సందర్శన

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 24, 25 తేదీల్లో న్యాక్ బృందం పర్యటించనుందని ప్రిన్సిపల్ డాక్టర్ జి.పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కళాశాల 1965లో ప్రారంభమై 59 సంవత్సరాలుగా మహిళా విద్యకు ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. 2018లో మూడోసారి న్యాక్ గ్రేడింగ్‌లో అత్యుత్తమ 'ఎ' గ్రేడ్ సాధించిందని, ఇప్పుడు నాలుగోసారి గ్రేడింగ్‌కు వెళ్తోందని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఖమ్మం: 80085 52623, 91541 18165
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081

సమస్య: శ్రీనగర్‌కాలనీ 13-16 వీధుల్లో మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా మార్చాలి: **సురేష్**
సమాధానం: ప్రతిపాదనలు చేస్తాం.


✗ మామిళ్లగూడెం వాటర్ ట్యాంకు ఎదురు వీధిలో వీధి దీపాలు లేకపోవడం సమస్యగా మారింది: **ప్రసాద్**
✔ పరిశీలించి ఏర్పాటు చేస్తాం: **కృష్ణలాల్, ఈఈ**
✗ వరదయ్యనగర్‌లో పాగింగ్ చేయలేదు. **(ప్రసాదరావు)**
✔ పాగింగ్ చేయిస్తాం: **సాంబయ్య, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**
– ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభం


క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మేయర్ నీరజ, అభిషేక్ అగస్త్య

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: జిల్లా ఆసుపత్రి, అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణల్లో ఏర్పాటు చేసిన 'ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్'లను మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం ప్రారంభించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు, వారిని వ్యాపారులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా శక్తి పథకం ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. మరిన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు వారు వెల్లడించారు. కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్‌రావు, సహాయ కమిషనర్ షఫీఉల్లా, ఆసుపత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, మెప్మా డీఎంసీ సుజాత, ఏడీఎంసీ సుజాత, సీఓలు ఉపేంద్ర, రోజా రామ్మోహన్‌రావు, స్థానికులు ఎర్రం బాలగంగాధర్ తిలక్ పాల్గొన్నారు.

ప్రమాద రహితంగా.. ప్రమోదభరితంగా..



దీపావళి అంటేనే గుర్తొచ్చేది బాణసంచా.. వెలుగు దివ్వెలతోపాటు బాంబులు, చిచ్చుబుడ్లు, కాకర కొవ్వొత్తుల కాల్చడం సరదా.. నగరంలో దీపావళి కొనుగోళ్ల సందడి మొదలైంది. బాణసంచా దుకాణాల ఏర్పాటుకు నగరపాలక సంస్థ అధికారులు, పోలీసులు కసరత్తు చేస్తున్నారు. ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు.

ఖమ్మం నేరవిభాగం, కార్పొరేషన్, న్యూస్‌టుడే

120 దుకాణాలకు అనుమతి

నిర్దేశించిన ప్రాంతంలో 120 బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. 27 దుకాణాల కేటాయింపునకు డ్రా తీయాలని నిర్ణయించారు. దరఖాస్తుదారులతో పోలీసు ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో చర్చించారు. వివిధ శాఖలకు చెల్లించాల్సిన ఫీజులను దరఖాస్తుదారులకు సూచించారు. రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తిచేయనున్నట్టు సంబంధిత అధికారులు వెల్లడించారు.


మాట్లాడుతున్న అదనపు డీసీపీలు నరేశ్‌కుమార్, ప్రసాద్‌రావు

అవగాహన సమావేశం

దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్నవారితో అదనపు డీసీపీ నరేశ్‌కుమార్, డీసీపీ ప్రసాద్‌రావు, టౌన్ ఏసీపీ రమణమూర్తి, విద్యుత్తు సంస్థ డీఈ రామారావు బుధవారం సమావేశం నిర్వహించారు. పోలీస్, మున్సిపల్, అగ్నిమాపక, విద్యుత్తు సంస్థలు నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే అనుమతితో దుకాణాలను ఏర్పాటు చేయాలన్నారు. ముందు జాగ్రత్తగా ఇసుక, నీరు, రెండు అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసినా, తయారు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాల ముసుగులో అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే దుకాణదారులు ఎవరికీ డబ్బులు ఇవ్వవద్దని సూచించారు.

నిబంధనలు ఇలా..

★ టపాసుల దుకాణానికి ఆన్‌లైన్‌లో పోలీసు కమిషనర్ కార్యాలయానికి అక్టోబరు 25 లోపు దరఖాస్తు చేసుకోవాలి. ★ దుకాణానికి నిర్దేశిత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. విద్యుత్తు, అగ్నిమాపక, మున్సిపల్ శాఖల నుంచి ఎన్‌ఓసీ తప్పనిసరిగా తీసుకోవాలి. ★ లైసెన్సులు మూడు రోజులకు మాత్రమే వర్తిస్తాయి. ★ ప్రతి దుకాణం వద్ద అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఉంచాలి. ★ 200 లీటర్ల వాటర్ బ్యారల్, నాలుగు ఇసుక బకెట్లు, ఆరు నీటి బకెట్లు ఉంచుకోవాలి. ★ దుకాణంలో పాత విద్యుత్తు తీగలు, అతుకులు కలిగిన కేబుల్స్ వాడవద్దు. ★ దీపాలు, పెట్రోమ్యాక్స్‌లు దుకాణాల వద్ద ఉంచరాదు. జనరేటర్‌ను 15 నుంచి 20 మీటర్ల దూరంలో ఉంచాలి. ★ దుకాణంలో 18 ఏళ్ల పైబడిన వారే పని చేయాలి. ★ గోదాం ఊరికి ఐదు కిలో మీటర్ల దూరంలో ఏర్పాటు చేసుకోవాలి. ★ దుకాణాలను జనావాసాల మధ్య ఏర్పాటు చేయరాదు.

పిల్లల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్


పాపను ఎత్తుకున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: కలెక్టరేట్ భవనంలోని పిల్లల సంరక్షణ కేంద్రం (క్రెచ్)ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం సందర్శించారు. మహిళలకు కోసం ప్రత్యేకంగా సిద్ధం చేస్తున్న గది, భోజనశాలలను తనిఖీ చేశారు. సంరక్షణ కేంద్రంలోని చంటి పాపలను ఎత్తుకుని లాలించారు. ఉద్యోగులు నిశ్చింతగా విధులు నిర్వహించేలా పిల్లల సంరక్షణ చేపట్టాలని సూచించారు. పిల్లలు ఆహ్లాదంగా గడిపేందుకు గదిలో ఏసీ, అవసరమైన ఆట వస్తువులు, ఇతర సామగ్రి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పీఆర్‌డీఈ మహేష్, ఏఈ చిరంజీవి, పిల్లల సంరక్షణ కేంద్రం ఇన్‌ఛార్జి రాణి తదితరులున్నారు.

టీజీఎన్పీడీసీఎల్ సర్కిల్ పీఓగా తిరుపతి



ఖమ్మం రోటరీనగర్, న్యూస్‌టుడే: టీజీఎన్పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ పర్సనల్ ఆఫీసర్(పీఓ)గా జె.తిరుపతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న ఈ స్థానంలో వరంగల్‌కు చెందిన తిరుపతిని నియమిస్తూ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు మందపాటి సత్యనారాయణరెడ్డి, ఎ. రవికుమార్, ఆర్. సత్యనారాయణ, వల్లాల యుగంధర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

తవ్వి వదిలేశారు!



నగరంలోని 18వ డివిజన్‌లో అభివృద్ధి పనులు ఆదిలోనే హంసపాదులా తయారయ్యాయి. మురుగు కాల్వ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. కాల్వ కోసం తవ్వి వదిలేయడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. నీటి నిల్వలు పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలుతాయని డివిజన్ వాసులు భయాందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఆగస్టులో స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణం కోసం నగరపాలకం నుంచి రూ.1.35 లక్షలు కేటాయించి పనులు ప్రారంభించారు. నేటికీ నిర్మాణం పూర్తి కాకపోవడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వెంటనే పూర్తి చేయాలని కోరుతున్నారు. ఈఈ కృష్ణలాల్‌ను వివరణ కోరగా పరిశీలించి బాగు చేయిస్తామన్నారు.

– ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే

జోరుగా.. హుషారుగా..

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి ఏడాది విద్యార్థులకు బుధవారం స్వాగత వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు పాటలతో, నృత్యాలతో అలరించారు. 'మిస్ ఫ్రెషర్స్' పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసశర్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నృత్యాలతో అలరిస్తున్న విద్యార్థులు

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ఫణీందర్

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: పెట్టుబడులు, అధిక లాభాల ముసుగులో సైబర్ కేటుగాళ్ల వలలో పడి మోసపోవద్దని సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణీందర్ సూచించారు. నగరంలోని సాహితి జూనియర్ కళాశాలలో సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆన్‌లైన్ ట్రేడింగ్, పెట్టుబడి, కొరియర్ స్కామ్, ఉద్యోగం పేరిట మోసపోయినట్లు పలువురు తమకు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. అపరిచితులు పంపే లింకులు, వెబ్‌సైట్లు, అప్లికేషన్స్, మెస్సేజ్‌లను నమ్మవద్దన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం, cyber-crime.gov.in లో రిపోర్ట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రంజిత్ కుమార్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ బాధ్యులు నరసింహారావు, షిటీం బాధ్యులు యశోద, స్కోప్ ఆర్డీ సమన్వయకర్త సుజాత తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీల్లో పతకాలు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: ఇటీవల గుంటూరులో జరిగిన సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో ఖమ్మం కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలకు చెందిన గోపీచంద్, అఫ్రీన్ 400 మీటర్లు, 400 మీటర్ల రిలే పరుగులో రజత పతకాలు సాధించారు. బుధవారం కేఎండీసీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ కొటా అప్పిరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రమణారావు, పీడీ ఉపేందర్ పాల్గొన్నారు.

బీసీ గురుకులాల ఆటల పోటీలు ప్రారంభం

ఖమ్మం సంక్షేమవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి బీసీ గురుకుల పాఠశాలల ఆటల పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. బాలురకు బోనకల్లు జూనియర్ కళాశాల కిష్టారంలో, బాలికలకు రఘునాథపాలెం గురుకుల పాఠశాల ఆవరణలో క్రీడలు నిర్వహిస్తున్నారు. పోటీలను ఆర్సీఓ బ్యూలారాణి, కళాశాలల ప్రధానోపాధ్యాయులు ప్రారంభించారు.

రైల్వే మూడోలైన్ పనుల పరిశీలన

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో చేపట్టిన మూడో రైల్వేలైన్ పనులను కమిషనర్ అభిషేక్ అగస్త్య, రైల్వే ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎంత భూమిని సేకరిస్తున్నారు.. పట్టాల కింద కాల్వల నిర్మాణం వంటి అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు.

ఏడు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: అనుమతి లేకుండా మున్నేరు చిన్నమండవ రేవు నుంచి దొంగతనంగా ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఖానాపురం హవేలి ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్ తెలిపారు. పెట్రోలింగ్ సందర్భంగా మమత రోడ్డులో వీటిని పట్టుకున్నామని, ట్రాక్టర్ డ్రైవర్ కం ఓనర్లపై ఏఎస్ఐ వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రి మార్చురీలో భద్రపరిచిన మూడు అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించినట్లు అన్నం సేవా ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. వైద్యాధికారులు, పోలీసుల సూచన మేరకు బల్లేపల్లి వైకుంఠధామంలో దహన సంస్కారాలు పూర్తి చేసినట్లు వివరించారు.

'భాజపాతోనే అభివృద్ధి సాధ్యం'

కామేపల్లి, కూసుమంచి, న్యూస్‌టుడే: భాజపాతోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. శ్రీనివాస్ యాదవ్ అన్నారు. జాస్తిపల్లిలో భాజపా సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు.

✦ కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో సభ్యత్వ నమోదు చేపట్టారు.

బాధిత కుటుంబానికి ఎంపీ రఘురాంరెడ్డి పరామర్శ

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దతండాకు చెందిన చల్లపల్లి రాధమ్మ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి బుధవారం పరామర్శించారు. రాధమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, నరేందర్ పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల పరామర్శ: చల్లపల్లి రాధమ్మ కుటుంబాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. సీపీఎం సీనియర్ నాయకులు పి. సోమయ్య, యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడి మృతి: కామంచికల్లుకు చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు మేదరమెట్ల వెంకటరామనరసయ్య(84) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ నాయకుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ నివాళులర్పించారు.

అండగా ఉంటా: ఎమ్మెల్యే కోరం

కామేపల్లి, న్యూస్‌టుడే: మద్దులపల్లిలో పిడుగుపాటుతో మృతి చెందిన చింతల లింగస్వామి, కావేరి మృతదేహాల వద్ద ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం నివాళులర్పించారు. ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మల్లిబాబు, గోపిరెడ్డి, గబ్రూ, రామనాథం ఉన్నారు.

నగర సమస్యలపై దృష్టి సారించాలి: సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు విక్రమ్

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరపాలక పరిధిలో సమస్యలపై అధికారులు దృష్టి సారించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై. విక్రమ్ డిమాండ్ చేశారు. సీపీఎం 44వ డివిజన్ శాఖ మహాసభ బుధవారం పాత పీఆర్టీయూ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ జెండాను సీనియర్ నాయకుడు జాన్‌ఖాన్ ఆవిష్కరించారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో విక్రమ్ మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్ డిపో రోడ్డును 100 అడుగుల రోడ్డుగా అభివృద్ధి చేయాలని, సరితా క్లినిక్ సెంటర్ నుంచి ఎన్నెస్పీ రోడ్డు వరకు 80 అడుగుల రోడ్డు విస్తరణ చేయాలని డిమాండ్ చేశారు. రెండో పట్టణ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు ఎస్‌కె. హుస్సేన్, డి. నాగరాజు, షకూర్, మల్లికార్జున్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

సర్వజనాసుపత్రి సమస్యల పరిశీలన

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: సర్వజన ఆస్పత్రిలో సమస్యలను బుధవారం మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్ పరిశీలించారు. మెడికల్ సూపరింటెండెంట్ ఎల్. కిరణ్ కుమార్‌తో కలిసి రోగుల వార్డులను తనిఖీ చేశారు. సహాయకులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆయన సూచనల మేరకు కేబుల్ అమర్చి సీటీ స్కాన్ సేవలను పునరుద్ధరించారు. ముఖ్యమంత్రి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆర్ఎంఓలు కళావతిబాయి, రాంబాబు, వినాయక్‌రాథోడ్, నాయకులు ఆశ్రీఫ్, వాసు, సాయికిరణ్, లక్ష్మయ్య, కోటేశ్వరరావు, సతీష్ ఉదయ్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం జాగా...

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇళ్ల స్థలాలు లేని కుటుంబాలకు స్థలాలు ఇచ్చేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు చింతపల్లిలో ప్రభుత్వ స్థలాలను తహసీల్దారు రాంప్రసాద్ బుధవారం పరిశీలించారు. స్థానిక నాయకులు, సర్వేయర్‌తో కలిసి ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని తహసీల్దారు పేర్కొన్నారు.

చిమ్మపూడి ఆలయంలో చోరీకి యత్నం


దొంగలు వదిలి వెళ్లిన ద్విచక్ర వాహనం

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: చోరీకి వచ్చి ద్విచక్ర వాహనం వదిలేసిన ఘటన చిమ్మపూడిలో మంగళవారం రాత్రి జరిగింది. శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయం వద్దకు రెండు ద్విచక్ర వాహనాలపై రాత్రి 10 గంటలకు దొంగలు వచ్చారు. అలికిడికి పూజారి, గ్రామస్థులు ఆలయం వద్దకు వెళ్లడంతో ఒక ద్విచక్ర వాహనం వదిలి పారిపోయారు. స్వాధీనం చేసుకున్న గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. కొద్దిసేపటికి వారు మరోమారు ఆలయం వద్దకు వచ్చారు. ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో సమీపంలో నివసించే సీతారామిరెడ్డి ద్విచక్రవాహనం తీసుకెళ్లారు. గ్రామస్థులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనంపై ఉన్న నంబరును ఆన్‌లైన్‌లో పరిశీలించగా కామేపల్లి మండలం ముచ్చర్లకు చెందిన రామారావు పేరిట ఉంది. ఆయన రెండు నెలల క్రితమే ఫిర్యాదు పోలీసు స్టేషన్‌లో చేసినట్లు తెలిసింది. మార్చి 23న సుమారు రూ.లక్ష విలువైన 130 రాగి కలశాలు, గంటలు, స్వామి వారి వెండి వస్తువులు చోరీ చేశారు. నేటికీ ఈ చోరీని పోలీసులు ఛేదించలేకపోయారు. సంఘటనపై ఆలయ పూజారి మురళీకృష్ణమాచార్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీసీఎస్ సెటిల్‌మెంట్ నగదు అందజేత


లబ్ధిదారు కుటుంబానికి చెక్కు అందిస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: మధిర సెక్షన్ పరిధిలో పందిళ్లపల్లి రైల్వేస్టేషన్‌లో పాయింట్‌మెన్‌గా పనిచేసిన జె. విజయ్‌కుమార్ ఇటీవల రైలు ప్రమాదంలో మరణించారు. ఈ నేపథ్యంలో సీసీఎస్ సెటిల్‌మెంట్ ఫండ్ కింద మంజూరైన రూ.1,99,895 విలువైన చెక్కును మృతుని భార్య శోభారాణి, కుటుంబ సభ్యులకు బుధవారం మజ్దూర్ యూనియన్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో డోర్నకల్ బ్రాంచి కార్యదర్శి, సీసీఎస్ డైరెక్టర్ అంజియాదవ్, మజ్దూర్ యూనియన్ మధిర బ్రాంచి కార్యదర్శి సంపత్‌రావు, మధిర బ్రాంచి వైస్ ఛైర్మన్ సత్యనారాయణ, మధిర యూత్ కమిటీ సభ్యులు కుమార్, ముస్తఫా, సిరి, నవీన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: 'దాతలు స్పందిస్తే.. ఆ ఊరిలో తొలి వైద్యుడు' శీర్షికన ఐదు రోజుల కిందట 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. మహా ఆది సేవా సమితి ఆధ్వర్యంలో.. సుర్దేపల్లికి చెందిన వైద్య విద్యార్థి శ్రీపతికి రూ.16,500 బుధవారం అందించారు.

ఎస్సారెస్పీ కాల్వకు భూసేకరణ నిలిపివేయాలని వినతి

కూసుమంచి, న్యూస్‌టుడే: ఎస్సారెస్పీ కాల్వకు భూసేకరణ నిలిపివేయాలని చౌటపల్లి రైతులు ఎస్సారెస్పీ ఫేజ్‌టు పరిధిలోని మరిపెడ డీఈఈ సంజీవ్, ఇతర ఇంజినీర్లకు విజ్ఞప్తి చేశారు. చౌటపల్లి ప్రాంతంలో 53వ ప్యాకేజీ పరిధిలో ఒక కాల్వ తవ్వకం పనులు నిలిచిపోయాయి. సుమారు 600 మీటర్ల ఈ కాల్వ తవ్వకానికి 7.80 ఎకరాల భూములు సేకరించాల్సి ఉండగా, డీఈఈ సంజీవ్, ఇతర ఇంజినీర్లు బుధవారం ఇక్కడికి వచ్చారు. ఈ ప్రాంతంలో నీరు సమృద్ధిగా ఉందని కాల్వ అవసరం లేదని, తాము భూములు ఇచ్చే ప్రసక్తి లేదని రైతులు తేల్చి చెప్పారు. భూసేకరణ పనులు నిలిపివేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. కూసుమంచి మండలంలోని చౌటపల్లి, తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు రైతులు ఈమేరకు విజ్ఞప్తి చేశారు.

చిమ్మపూడి కార్యదర్శి బదిలీ

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: చిమ్మపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శి భారతి బదిలీ అయ్యారు. ఇటీవల బదిలీల సందర్భంగా ఆమె వైరా మండలం లక్ష్మీపురం నుంచి చిమ్మపూడి వచ్చారు. అక్కడి ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఆమెను తిరిగి లక్ష్మీపురం బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చిమ్మపూడి గ్రామ పంచాయతీకి ఎవరినీ కేటాయించలేదు. భారతి తన విధుల నుంచి బుధవారం రిలీవ్ అయ్యారు.

ఆకట్టుకున్న వస్త్ర ప్రదర్శన

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలోని బైపాస్ రోడ్డు ఆర్ఆర్ఆర్ వేడుకల మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్, లైఫ్ స్టైల్ ప్రదర్శన వినియోగదారులను ఆకట్టుకుంది. నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ.. ప్రదర్శన 25వ తేదీ రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ప్రదర్శనలో వస్త్రాలను పరిశీలిస్తున్న మహిళలు

సంతను సందర్శించిన అధికారుల బృందం

కామేపల్లి, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయి సందర్శన నిమిత్తం మండలంలోని రేపల్లెవాడకు వచ్చిన సివిల్ సర్వీసెస్ అధికారుల బృందం సభ్యులు పండితాపురం పశువుల సంతను బుధవారం సందర్శించారు. పశువులు, జీవాల క్రయావిక్రయాలను గురించి రైతులు, వ్యాపారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగన్నాథతండాలో పొదుపు సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. ఏపీఎం సురేంద్రబాబు, సీసీలు ప్రసాద్, మల్లయ్య, వీరభద్రం పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటంలో మాలలు పాల్గొనాలి'


సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః పరిశీలించాలని రాష్ట్రస్థాయిలో జరుగుతున్న పోరాటంలో మాలలు పాల్గొనాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ గుంతెటి వీరభద్రయ్య పిలుపునిచ్చారు. అంబేడ్కర్ భవన్‌లో జిల్లా ముఖ్య నాయకులు సమావేశం బుధవారం నిర్వహించారు. జిల్లాలోని మాలపల్లెల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. నవంబరులో హైదరాబాద్‌లో జరిగే మాలల సింహగర్జనకు వేలాదిగా తరలిరావాలన్నారు. కోకన్వీనర్లుగా మోటపోతుల బాబురావు, దామల సత్యనారాయణ, గుమ్మడి కనకరాజు, తొగరు భాస్కర్, కామా సంపత్‌కుమార్, మేకతోటి కాంతయ్య తదితరులను ఎన్నుకున్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర మొండి వైఖరిని నిరసిస్తూ 25 నుంచి 30 వరకు జరుప తలపెట్టిన ధర్మయుద్ధ మహాసభలను జయప్రదం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎంఆర్‌పీఎస్) రఘునాథపాలెం మండలం అధ్యక్షుడు గాజుల నరసింహారావు పిలుపునిచ్చారు. వేపకుంట్లలో మాట్లాడారు. మంద గోపాలరావు, నేలాల నాగేశ్వరరావు, గురవయ్య, నాగరాజు, రాకేశ్, నవీన్, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమణల తొలగింపు ముమ్మరం

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలోని ఇల్లెందు రోడ్డులో పలు ప్రాంతాల్లో చేపట్టిన నిర్మాణాలను తొలగించిన సిబ్బంది, ఇనుప రేకులతో వేసిన షెడ్లను అక్కడ నుంచి క్రేన్‌ల సహాయంతో తరలించారు.

జోరుగా జరిమానాలు: నగరంలో పారిశుద్ధ్య నిబంధనలను అతిక్రమించిన వారికి వేసే జరిమానాలను ముమ్మరం చేశారు. చెత్తను నిబంధనలకు విరుద్ధం కాలువల్లో వేసిన వారికి, చెత్త తగలబెట్టిన వారికి పారిశుద్ధ్య సిబ్బంది జరిమానాలు విధించారు.

దయచేసి వినండి.. ఇటువైపు రాకండి!


మూడో లైన్ పనుల కోసం పొక్లెయిన్‌తో తవ్వకాలు

ఖమ్మం గాంధీచౌక్ దారిలోని రైల్వే గేటు వద్ద పనులు జరుగుతున్నాయి. మూడు రోజులుగా రైల్వే గేటు మరమ్మతు పనులు, పాయింట్ పార్కింగ్ మెషిన్ వర్కుతో పాటు మూడో ట్రాక్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మూడు రోజులు ఈ దారిలో రాకపోకలు సాగించే వాహనదారులకు, పాదచారులకు సూచనలు చేస్తూ నోటీసులను అంటించారు. రైల్వే అధికారులు, పాదచారులు, వాహనదారులు దూసుకురావడమే కాకుండా ప్రమాదకర గుంతల పక్కన నడుస్తున్నారని, గేటు దూరి శిథిల గోడల వెంట ప్రమాదకరంగా వెళ్తున్నారు. సిబ్బందిని పెట్టినా జనం వినడం లేదని వాపోతూ పనులను సాగిస్తున్నామని రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ దేవప్రియుడు వెల్లడించారు. రెండు రోజుల్లో తిరిగి అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. – ఈనాడు, ఖమ్మం


ప్రమాదకరంగా వెళ్తున్న పాదచారులు


రైల్వే గేటు దూరి వెళ్తూ..